


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 347 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 17 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :347 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 17 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కాల్వలోకి దూసుకెళ్లిన కారు..
# నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి



పెన్ పవర్ డెస్క్: పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందగా.. ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఇరగవరం మండలం అయితంపూడి లాకుల సమీపంలో

- మిగతా 2లో



## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..
# రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం
- డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ

- మిగతా 2లో




- సోమవారం నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
- శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి
- సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు
- మెగా డీఎస్సీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో చర్చకు వైసీపీ వ్యూహం




పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది.

మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

- మిగతా 2లో



## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'..
# వైసీపీపై ఫైర్

- విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన

- మిగతా 2లో

## ఏపీ నుంచి 29 మంది ఉత్తమ ఉపాధ్యాయులను
# ఫిన్లాండ్‌కు పంపిన ప్రభుత్వం



పెన్ పవర్ డెస్క్: ఏపీ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. గ్లోబల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ నుంచి 29 మంది ఉత్తమ

- మిగతా 2లో

# నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె వివాహం.. హాజరైన చంద్రబాబు, రేవంత్



హైదరాబాద్: పెన్ పవర్ :నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు, తెలంగాణ సీఎం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# దిమాగీ నక్సల్ వ్యాఖ్యలపై పొలిటికల్ వార్..
## మోదీకి చిదంబరం కౌంటర్, రిజిజు స్ట్రాంగ్ రిప్లై



ప్రధాని మోదీ దిమాగీ నక్సల్ వ్యాఖ్యలపై రాజకీయంగా దుమారం రేగింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం..నేనూ దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నని కైంటర్ ఇచ్చారు. మావోయిస్టు మనస్తత్వం కలిగినవ్యక్తులు వ్యవస్థలో పాతుకుపోయారని, విధానాలను ప్రభావితం చేస్తూ దేశానికి ముప్పుగా మారానని ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో హెచ్చరించారు. ఖలో వేదికగా చిదంబరం స్పందిస్తూనేనుదిమాగీ నక్సల్ అయినందుకు : గర్వపడుతున్నానని రాశారు. అయితే చిదంబరం

- మిగతా 2లో




## ప్రభుత్వాల సెన్సార్‌షిప్‌పై
# ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం..

- కంటెంట్ తొలగింపుపై ప్రభుత్వ ఆదేశాలను బహిర్గతం చేయనున్న ఎక్స్
- పారదర్శకత పెంచడంలో భాగంగానే ఈ నిర్ణయమన్న ఎలాన్ మస్క్
- ఏ ప్రభుత్వ ఏజెన్సీ అభ్యర్థించిందో యూజర్లు చూడగలరు
- మస్క్ యాజమాన్యంలో ప్రభుత్వ అభ్యర్థనల అమలు రేటు అధికమని నివేదిక
- రికమండేషన్ అల్గారిథమ్‌పైనా పారదర్శకతకు చర్యలు

- మిగతా 2లో

## అమెరికా సైనికులను పట్టుకున్నా.. చంపేసినా..
# 30 వేల డాలర్ల రివార్డు
## ఇరాన్ ఆర్మీ చీఫ్ సంచలన ప్రకటన..




టెహ్రాన్: ఇరాన్, అమెరికా యుద్ధం ఊహించని మలుపు తిరిగింది. ఇరాన్ సైన్యం సంచలన ప్రకటన చేసింది. అమెరికా సైనికులను పట్టుకున్నా.. చంపేసినా.. 30 వేల డాలర్ల రివార్డు ఇవ్వనున్నట్టు ఇరాన్ ప్రకటించింది. ఒకవేళ ఈ పనిని ఒక మహిళ చేస్తే.. ఆ బహుమతి రెట్టింపు చేస్తామని ఇరాన్ చేసిన ప్రకటన అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఆర్థిక సహాయంలో పాలుపంచుకోవడానికి అనేక అభ్యర్థనలు వచ్చిన క్రమంలో ఈ ప్లాన్ అమలు చేయాలని భావిస్తున్నట్లు ఇరాన్ సైన్యాధిపతి

- మిగతా 2లో

# కాంగ్రెస్ నేతలూ.. సిగ్గుపడండి



## నిప్పులుచెరిగిన హోంమంత్రి అమిత్ షా

పెన్ పవర్ డెస్క్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన అంశంపై వివాదం రాజుకుంది. రాజస్థాన్‌లోని చిత్తౌడ్‌గఢ్ లో

- మిగతా 2లో

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. మండలిలో హోరాహోరీ!

**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ**

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

**మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: జగన్**

అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది. పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ-2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు.

దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

## ఎడిటర్ వ్యూ

## విర్రవీగితే అంతే

తూర్పు ఇండోనేసియాలో శనివారం సంభవించిన భారీ భూకంపం ధాటికి మృతుల సంఖ్య 47కు చేరింది. 100 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇళ్లను వదిలి తాత్కాలిక ఆశ్రయాలకు వెళ్లారు. ఆదివారం శిథిలమైన భవనాలు, కొండచరియల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు గాలింపు చేపట్టాయి. ప్రాణాలతో బయటపడినవారి కోసం కూడా గాలిస్తున్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగ్గరై రీజెన్సీలో 24 మంది, పొరుగున ఉన్న తూర్పు మంగ్గరైలో 17 మంది మృతి చెందారు. సిక్కా, నగాడా, ఎండే రీజెన్సీల్లోనూ మరణాలు నమోదయ్యాయి. ఫ్లోరెస్ దీవిలోని ఆరు రీజెన్సీల్లో భూకంపం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వాటి కింద గ్రామస్థులు చిక్కుకుని ఉంటారనే అనుమానంతో సహాయక సిబ్బంది గాలిస్తున్నారు.

**తీవ్రత ఎక్కువగా ఉండటంతో...**

అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం.. తూర్పు నుసా తెంగారా ప్రావిన్స్‌లోని ఎండేకు 68 కిలోమీటర్ల దూరంలో, సముద్రతీరానికి సమీపంలో 10 కిలోమీటర్ల లోతున భూకంపం కేంద్రం ఉంది. దీని తీవ్రత 7.7గా నమోదైంది. ఫ్లోరెస్ దీవి మొత్తం ప్రకంపనలకు గురైంది. దీంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పశ్చిమ నుసా తెంగారా, దక్షిణ సులవేసిలోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రకంపనలు కనిపించాయి. భూకంపం వల్ల 900కుపైగా ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో 450 ఇళ్లు దెబ్బతిన్నాయి. దాదాపు 5,000 మంది తాత్కాలిక శిబిరాలకు తరలివెళ్లారు. బలమైన ప్రకంపనలు మళ్లీ వస్తాయనే భయంతో వేలాది మంది రాత్రంతా బయటే గడిపారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, చర్చిలు సహా కనీసం 167 ప్రభుత్వ, ప్రజా భవనాలు దెబ్బతిన్నాయి. బాధితులకు బియ్యం, సిద్ధంగా తినే ఆహారం, తాగునీరు, దుప్పట్లు, మందులను సహాయక సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్, సమాచార వ్యవస్థలను పునరుద్ధరించడం, కొండచరియల వల్ల రాకపోకలు నిలిచిపోయిన మారుమూల గ్రామాలకు సాయం చేర్చడం ప్రధాన సవాళ్లుగా మారాయి.

**కొండచరియలతో రహదారుల దిగ్బంధం...**

ఇండోనేసియాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొమోడో నేషనల్ పార్క్‌కు ప్రధాన ద్వారంగా ఉన్న లబువాన్ బాజోను కూడా భూకంపం తాకింది. దాదాపు 700 కిలోమీటర్ల పొడవైన ట్రాన్స్-ఫ్లోరెస్ హైవేపై పలు చోట్ల కొండచరియలు విరిగిపడి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారి పర్వత ప్రాంతంలోని పలు పట్టణాలు, గ్రామాలను కలుపుతుంది. దెబ్బతిన్న ఇళ్లలోకి వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. దీంతో చాలామంది ఆరుబయటే నిద్రిస్తున్నారు. లబువాన్ బాజోకు చెందిన రైతు అనస్తాసియా ఇమాడ్ తన దెబ్బతిన్న ఇంటి పక్కన ఏర్పాటు చేసిన ఆకుపచ్చ టెంట్‌లో మాట్లాడుతూ.. "భూమి వణికిన తీరు భయానకంగా ఉంది. ప్రకంపనలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే మా ఇల్లు దాదాపు కూలిపోయే పరిస్థితి వచ్చింది. నిద్రిస్తున్న సమయంలో భూప్రకంపనలు మళ్లీ వస్తే ఇల్లు మా మీద కూలిపోతుందేమోనని భయపడ్డాం" అని చెప్పారు. భూకంపం తర్వాత రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాల్లో ఆదివారం సహాయక బృందాలు మళ్లీ గాలింపు ప్రారంభించాయి. ముఖ్యంగా మంగ్గరై, తూర్పు మంగ్గరై, నగెకియో రీజెన్సీల్లో గాలింపు ముమ్మరం చేశారు. "చాలావరకు కొండచరియలను తొలగించి, రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు రహదారులను తెరిచాం. అయితే సమాచార వ్యవస్థలో అంతరాయాలు, విద్యుత్ కోతలు గాలింపు చర్యలకు ఇబ్బందిగా మారాయి" అని సిక్కా రీజెన్సీ రాజధాని మౌమెరెలోని గాలింపు, సహాయక కార్యాలయ అధిపతి ఫతుర్ రహ్మాన్ తెలిపారు. కూలిపోయిన ఇళ్లు, ఇతర భవనాల శిథిలాల్లో బాధితుల కోసం గాలింపు కొనసాగుతోందని ఆయన చెప్పారు.

**'రింగ్ ఆఫ్ ఫైర్'లో ఇండోనేసియా...**

17,000కుపైగా దీవులతో కూడిన ఇండోనేసియాలో తరచూ భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనలు సంభవిస్తుంటాయి. పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్'గా పిలిచే భూకంప, అగ్నిపర్వత ప్రాంతంలో ఆ దేశం ఉండటమే ఇందుకు కారణం. ఫ్లోరెస్ దీవి గతంలోనూ భారీ విపత్తులను ఎదుర్కొంది. 1992లో సంభవించిన భారీ భూకంపం, సునామీలో ఈ దీవిలో సుమారు 2,500 మంది ప్రాణాలు కోల్పోయారు. 2018లో సులవేసిలో 7.5 తీవ్రతతో వచ్చిన భూకంపం సునామీకి దారితీసింది. ఈ ఘటనలో 4,400 మందికిపైగా మృతి చెందారు. 2004లో సుమత్రా తీరానికి సమీపంలో 9.1 తీవ్రతతో వచ్చిన భూకంపం భారీ సునామీని సృష్టించింది. 12 దేశాల్లో సుమారు 2.3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు.

## ప్రభుత్వాల సెన్సార్‌షిప్‌పై ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం..

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కంటెంట్ తొలగింపు లేదా పరిమితులపై ప్రభుత్వాల నుంచి వచ్చే అభ్యర్థనలను యూజర్లకు మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తామని ప్రకటించారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ జోక్యం, కంటెంట్ నియంత్రణ వంటి అంశాల్లో పారదర్శకతను పెంచే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. ఈ కొత్త మార్పుల గురించి ఎక్స్‌లో పోస్ట్ చేసిన మస్క్, "ప్రభుత్వాలు కోరిన ఏ సెన్సార్‌షిప్ అయినా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది" అని తెలిపారు. దీని ప్రకారం, ఏ ప్రభుత్వ ఏజెన్సీ పోస్టులను తొలగించాలని కోరింది, ఏ ఖాతాలపై పరిమితులు విధించాలని అడిగింది వంటి వివరాలను యూజర్లు నేరుగా చూడగలుగుతారు. వీలైతే, ఆ అభ్యర్థనల వెనుక ఉన్న చట్టపరమైన కారణాలు లేదా సమర్థనలను కూడా వెల్లడించనున్నట్లు ఎక్స్ తెలిపింది. ఎక్స్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచి ఆన్‌లైన్ కంటెంట్‌ను ఎలా నియంత్రిస్తున్నారు, ర్యాంక్ ఇస్తున్నారు అనే విషయాల్లో యూజర్లకు పూర్తి పారదర్శకత ఉండాలని మస్క్ బలంగా వాదిస్తున్నారు. ఈ తాజా నిర్ణయం కూడా ఆయన విస్తృత లక్ష్యాల్లో భాగమే. ఇదిలా ఉండగా, క్రిప్టో బ్రీఫింగ్ నివేదిక ప్రకారం, మస్క్ యాజమాన్యంలో ఎక్స్.. ప్రభుత్వాల నుంచి వచ్చిన టేక్‌డౌన్ అభ్యర్థనలను 83 శాతం నుంచి 98.8 శాతం వరకు అమలు చేసింది. ఇది పాత యాజమాన్యం కంటే అధికం కావడం గమనార్హం. కేవలం ప్రభుత్వ అభ్యర్థనలకే పరిమితం కాకుండా, తమ రికమండేషన్ అల్గారిథమ్‌లను కూడా ఎక్స్ పారదర్శకంగా ఉంచుతోంది. టెక్నాలజీలోని కొన్ని భాగాలను ఓపెన్-సోర్స్ చేయడం ద్వారా, ఏ పోస్టులను ప్రమోట్ చేస్తున్నారు, వేటిని తగ్గించి చూపుతున్నారు అనే అంశాలపై పరిశోధకులకు, యూజర్లకు స్పష్టత ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తం మీద, కంటెంట్ నియంత్రణలో యూజర్లకు మరింత స్పష్టమైన సమాచారం అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్

తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు.

ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం

దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి

- మొదటి పేజి తరువాయి

ఆదివారం ఉదయం అదుపు తప్పిన కారు నరసాపురం పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఆదివారం సాయంత్రానికి నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి కోసం గాలిస్తున్నారు. ఈ ప్రమాదంలో కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరికి చెందిన పోతుల లక్ష్మీభానువికాస్ (18), నాగిరెడ్డి దుష్యంత్ సాయి(18), చెరుకూరి రాజారాం చరణ్ (16), అమలాపురంలోని చాకూరుకి చెందిన నాగాబత్తుల సాయిసూర్యతేజ (19), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలోని చింతపర్రుకి చెందిన వీరమల్లు సాయి వెంకటకిరణ్ (18) గల్లంతయ్యారు. ఆచంట మండలం వల్లూరుకి చెందిన మట్టా సంతోష్ ప్రాణాలతో బయటపడ్డాడు. వీరంతా పెరవలిలో వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. పెరవలి నుంచి నరసాపురం బయలుదేరగా మార్గంమధ్యలోని ఓగిడిలో స్నేహితుడిని కలిశారు. అక్కడి నుంచి అయితంపూడి మీదుగా వెళ్తుండగా నరసాపురం వైపు తిరిగే క్రమంలో లాకుల వద్ద కారు అదుపు తప్పి ఎదుట పంట కాలువలోకి దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో వర్షం పడుతుండగా ప్రయాణ సమయంలో ఎదురుగా ఉన్న కాలువను గమనించకపోవడంతో కారు నేరుగా కాలువలోకి దూసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో కాలువలో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో ప్రవాహ వేగానికి కారు సుమారు 100 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. సంతోష్ చెట్టు కొమ్మను పట్టుకోవడంతో స్థానికులు కాపాడారు. హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా

అయితంపూడి లాకుల వద్ద భానువికాస్, మరికొంతదూరంలో సాయివెంకటకిరణ్, నెగ్గిపూడి లాకుల వద్ద దుష్యంత్ సాయి, మార్టేరు సమీపంలో సాయిసూర్యతేజ మృతదేహాలు దొరికాయి. రాజారాం చరణ్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. చరణ్ మినహా మిగిలిన వారంతా నరసాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. అందరూ 20ఏళ్లలోపు యువకులే కావడంతో ఇరు జిల్లాల్లోనూ విషాదచాయలు అలుముకున్నాయి.

## దిమాగీ నక్సల్ వ్యాఖ్యలపై పొలిటికల్ వార్..

- మొదటి పేజి తరువాయి

పోస్టు కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు తీవ్రంగా స్పందించారు. ప్రధాని మోదీ ప్రతిపక్ష నేతలను దిమాగీ నక్సల్స్ అని పిలవలేదని, కేవలం నిర్దిష్ట వర్గాన్ని ఉద్దేశించిన మాత్రమే అలా అన్నారని కిరణ్ రిజుజు బదులిచ్చారు. మాజీ హోంమంత్రి ఇలా మాట్లాడటం దురదృష్టకరం, దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగించేవిధంగా ఉన్నాయని ఒ లో పోస్ట్ షేర్ చేశారు కిరణ్ రిజుజు. మావోయిస్టులకు సపోర్టు చేస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించేవారు, వేర్పాటు వాదులతో నిలబడి ఆర్టికల్ 370కి మద్దతు ఇచ్చేవారు, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేసేందుకు కుట్ర చేస్తున్నవారిని ఉద్దేశించి ప్రధాని ఆ వ్యాఖ్యలు చేశారని కిరణ్ రిజుజు బదిలిచ్చారు.

## అమెరికా సైనికులను పట్టుకున్నా.. చంపేసినా.. 30 వేల డాలర్ల రివార్డు

- మొదటి పేజి తరువాయి

అమీర్ హతామి చెప్పినట్లు ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ వెల్లడించింది. ఇజ్రాయెల్తో కలిసి అమెరికా ఇరాన్‌పై దాడి చేయడంతో ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం మొదలైంది. దాదాపు 40 రోజుల యుద్ధం తర్వాత ఏప్రిల్‌లో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఆ తర్వాత శాంతి చర్చల కోసం జూన్‌లో ముసాయిదా కూడా రూపొందించారు. కానీ అది విఫలమైంది. అప్పటి నుంచి ఇరాన్, అమెరికా అడపాదడపా కాల్పులు జరుపుకుంటున్నాయి. అయితే ఇటీవల ఈ యుద్ధం దక్షిణ ఇరాన్, హార్మూజ్ జలసంధి చుట్టూ కేంద్రీకృతమై సాగుతుండటం గమనార్హం.

## కాంగ్రెస్ నేతలూ.. సిగ్గుపడండి: నిప్పులుచెరిగిన హోంమంత్రి అమిత్ షా

- మొదటి పేజి తరువాయి

జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ టార్గెట్‌గా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ గీతం వందేమాతరం ఆలపిస్తుండగా, మధ్యలోనే ఆపేయాలని సోనియా గాంధీ పార్టీ అధ్యక్షుడికి సూచించారని అమిత్ షా ఆరోపించారు. కేవలం ఓటు బ్యాంక్ రాజకీయం కోసమే జాతీయ గేయాన్ని అవమానించిందని.. అందుకు కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలని కామెంట్ చేశారు. ఈ ఘటనపై సోనియా గాంధీ 140 కోట్ల భారతీయులకు, అలాగే వందేమాతరం రచయిత బంకిం చంద్ర ఛటర్జీకి బహిరంగ క్షమాపణలు చెప్పాలని అమిత్ షా డిమాండ్ చేశారు.

అయితే, 'వందేమాతరం' గేయాలాపనపై అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. వేడుకల్లో వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించామని క్లారిటీ ఇచ్చింది. ఈ విషయంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ మాట్లాడుతూ.. సోనియా గాంధీ పాటను ఆపమని చెప్పలేదని, కొంతసేపటి నుంచి నిలబడి ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే కోసం కుర్చీ వేయమని మాత్రమే కార్యకర్తలకు సూచించారని స్పష్టం చేశారు. బీజేపీ కావాలనే ఈ అంశాన్ని రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు.

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' (H.A.N.U.M.A.N ... Healing and Nurturing Units for Monitoring, Aid and Nursing of Wildlife ) బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

## ఏపీ నుంచి 29 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్లాండ్‌కు పంపిన ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

ఉపాధ్యాయులను ఫిన్లాండ్‌కు పంపింది. ఏపీలో విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా.. తరగతి గది అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి అనువుగా మార్చుకోగలిగే అంతర్జాతీయ పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యా పద్ధతులు, వినూత్న బోధనా విధానాలను నేరుగా చూసి.. ప్రత్యక్ష అనుభవాన్ని పొందేందుకు, ప్రభుత్వ పాఠశాలల నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన 29 మంది విద్యార్థులు ఆగస్టు 15న ఫిన్లాండ్‌కు బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఫిన్లాండ్‌లోని టర్కు విశ్వవిద్యాలయ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఆగస్టు 17 నుంచి 26 వరకు జరిగే ఎనిమిది రోజుల ఆన్‌సైట్ కార్యక్రమంలో భాగంగా.. ఉపాధ్యాయులు టర్కు, రౌమాను సందర్శించి, తరగతి గది పరిశీలనలు, విద్యా క్షేత్ర సందర్శనలు, బాల్య విద్యా కేంద్రాలు, ఉపాధ్యాయ శిక్షణ పాఠశాలలలోని విద్యావేత్తలతో సంభాషణలలో పాల్గొంటారు. ఉపాధ్యాయులు మన సమాజానికి పునాదులని, మన పిల్లల భవిష్యత్తుకు రూపకర్తలని.. మన విద్యార్థులను మాత్రమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును కూడా తీర్చిదిద్దే శక్తి వారికి ఉందని నారా లోకేష్ చెప్పారు. ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాల్లో అనుభవం కల్పించి వారిని శక్తివంతం చేయడం మన బాధ్యత అని మంత్రి నారా లోకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతర్జాతీయ అభ్యాస అవకాశం మన ఉత్తమ ఉపాధ్యాయులు ఫిన్లాండ్ నుంచి కొత్త ఆలోచనలు, ఉత్తమ పద్ధతులను తిరిగి తీసుకువచ్చి వాటిని మన పాఠశాలలకు అనుగుణంగా మార్చుకోవడానికి సహాయపడుతుందని మంత్రి నారా లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ, విశ్వసాన్ని నిలబెట్టుకుంటాను. జైతి ప్రభాకర్ రావు.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 16.** పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని జయతి ప్రభాకరరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజకీయ గురువు అయిన కీర్తిశేషులు స్వర్గీయ లోకులు గాంధీ గారి ప్రియ శిష్యుడను అయినందుకు నన్ను నమ్మి అల్లూరి సీతారామరాజు జిల్లా బిజెపి ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా ఇన్చార్జి పుట్టా గంగయ్య కు, జిల్లా అధ్యక్షులు మఠం శాంతకుమారి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఎంతో నమ్మకంగా గురుతర బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అప్పగించిన బాధ్యతలను నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బిజెపి సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవలో మరింత అంకిత భావంతో పనిచేస్తానని ప్రభాకర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు బిజెపి కార్యకర్తలు నాయకులు ప్రభాకరరావుని అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# కొర్రగుడ రహదారిలో నిత్యం రోడ్డు ప్రమాదాలు.

- కొంజారితోట,కొర్రగూడ దోబురంగిని,వయ్య దానరంగిని, ఘాట్ రోడ్డుకు మోక్షం లేదా?
- అడుగడుగున గోతులు గుంతలు,,రోడ్డు మధ్యలో కంకర కుప్పలు, నిత్యం రోడ్డు ప్రమాదాలు.
- జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం. కనీసం చలనం స్పందనలేని జిల్లా ఇంజినీరింగ్ శాఖ అధికారులు.

**అరకులోయ పెన్ పవర్ 16:**ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండలం బస్కీ గ్రామపంచాయతీ కోర్రగూడ, దానరంగిని, వయ్య దోబురంగిని, మారుమూల గ్రామాల ఘాట్ రోడ్డు రహదారిలో నిత్యం ప్రమాదాలు.. మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారులు అధ్వానంగా తయారయిందని మరమ్మత్తులకు నోచుకోవటం లేదని, ప్రభుత్వ ఉన్నత అధికారులు, మండల స్థాయి ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక పాలకులు పట్టించుకోవటం లేదని, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక గిరిజన గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అరకులోయ మండలం బస్కీ గ్రామపంచాయతీ కోర్రగూడ రోడ్డుకు మోక్షం లేదా? అంటూ పలువురు పర్యటకులు స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మించి సుమారు 10 సంవత్సరాలు గడుస్తున్న రోడ్డుకు మరమ్మత్తు చేయటం లేదని, రోడ్డు నిర్మించడంలో అధికారులు విఫలం చెందుతున్నారని స్థానికులు అంటున్నారు. తరుచుగా రోడ్డుప్రమాదం జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. కొన్నిచోట్ల కేవలం మెటల్ మాత్రమే వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే రహదారి నుంచి హుకుంపేట, అనంతగిరి, డుంబ్రిగూడ, అరకులోయ నాలుగు మండలాలకు అనుకుని ఉన్న 400 పైగా గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆ ప్రాంత ప్రజలు నిత్యవసర సరుకులు విక్రయించేందుకు శుక్రవారం అరకు వారపు సంతకు తీసుకు



రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని రైతులు వాపోతున్నారు. రోడ్డుపై అధికారులు స్పందన లేక రోడ్డు అసంపూర్తిగా దర్శనమిస్తుందని తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుకు మోక్షం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు, పర్యటకులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. రోడ్డుకు మోక్షం లేదా?అని ప్రశ్నించారు. అదే రహదారి నుంచి హుకుంపేట,బూర్జ గ్రామ పంచాయతీ, అనంతగిరి, డుంబ్రిగూడ, అరకులోయ నాలుగు మండలాలకు అనుకుని ఉన్న 20,000 వేల మంది పైగా గిరిజన గ్రామా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆ ప్రాంత ప్రజలు నిత్యవసర సరుకులు నిక్రయించేందుకు శుక్రవారం అరకు ఆదివారం సుంకరమెట్ట వారపు సంతకు తీసుకు రావాలంటే రవాణాకు ఇబ్బందులు పడుతున్నారని రైతులు విచారం. వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పై అధికారులు స్పందన లేక రోడ్డు అసంపూర్తిగా దర్శనమిస్తుందని తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుకు మోక్షం కలిగించేలా చర్యలు తీసుకోవాలని,తక్షణమే రహదారికి మరమ్మత్తుల పనులు చేపట్టాలని, నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రహదారి మరమ్మత్తులు చేపట్టాలని, గిరిజన ప్రజలు, పర్యటకులు సైతం ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తిచేస్తున్నారు.

# డీఎస్సీ అవకతవకలపై లోకేష్ రాజీనామా చేయాలి

డీఎస్సీ అక్రమాలను కప్పిపుచ్చేందుకే ఏపీపీఎస్సీ అంశాన్ని తెరపైకి తెస్తున్న ప్రభుత్వం.

ముంచంగిపుట్టు మండల వైసిపి అధ్యక్షుడు పాంగి పద్మారావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 16.**డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగిన అవకతవకలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని ముంచంగిపుట్టు మండల వైసిపి అధ్యక్షుడు పాంగి పద్మారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఏపీపీఎస్సీ అంశాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చి మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాల్సిందేనన్నారు. ఇప్పటికే సిట్ నివేదికతో పాటు సీఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌ల నివేదికలు కీలక అంశాలను స్పష్టం చేశాయని తెలిపారు. పురమా నవీన్ అనే కాంట్రాక్ట్ ఉద్యోగికి నిబంధనలను ఉల్లంఘించి ప్రశ్నపత్రాల డిజిటలైజేషన్ బాధ్యతను ఏ విధంగా అప్పగించారని పద్మారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదే నవీన్‌కు కృష్ణా జిల్లా టాపర్‌గా వచ్చినప్పటికీ ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటాకు సంబంధించి జీఓ నెం 47ను తీసుకొచ్చి, వెంటనే రద్దు చేసి జీఓ నెం 56ను ఎందుకు తీసుకు వచ్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాల వెనుక ఉన్న కారణాలను ప్రజల ముందు ఉంచాలని, ఏపీపీఎస్సీ అంశంతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం జరుగుతుందని, డీఎస్సీపై వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఏపీపీఎస్సీ అంశాన్ని తెరపైకి తీసుకురావడం కేవలం రాజకీయ దృష్టి మళ్లింపు చర్యనని ఆయన పేర్కొనారు. ఏపీపీఎస్సీ ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా జరిగిందని ప్రభుత్వం భావిస్తే, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలనీ సవాల్ చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ నియామక ప్రక్రియలో పారదర్శకత కోసం సీసీ కెమెరాలు, వేలిముద్రలు, ముఖ గుర్తింపు వంటి విధానాలను అమలు చేశామని గుర్తు చేశారు. నియామక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. డీఎస్సీ వ్యవహారంపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా గ్రూప్--1 అంశాన్ని తెరపైకి తెస్తున్న ప్రభుత్వం, ఒకవేళ నిజంగా పారదర్శకతపై నమ్మకం ఉంటే డీఎస్సీతో పాటు గ్రూప్--1 వ్యవహారాలపైనా సీబీఐ విచారణకు సిద్ధమా? అని ఆయన ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన ప్రతి అంశాన్ని ప్రభుత్వం ప్రజలకు వివరించాలని, నిరుద్యోగులు, అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని పద్మారావు డిమాండ్ చేశారు.

# మహిళలకు వంచన, దగా రెట్టింపు చేశారు

- ఎన్నికల్లో డబ్బులు పంచలేదని చంద్రబాబు ప్రమాణం చేయగలరా?
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ప్రశ్నించారు.

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 16:** మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఆరోపించారు. విశాఖలోని వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు.

మహిళల ఆత్మగౌరవాన్ని రెట్టింపు చేయలేదని, దగా, వంచనను మాత్రమే రెట్టింపు చేశారని విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డ్వాక్రా, ఉచిత బస్సు మహిళలతో చంద్రబాబు నిర్వహించిన తేనీటి విందు మహిళల సమస్యలకు పరిష్కారం చూపే కార్యక్రమం కాదని, కేవలం ప్రచార కార్యక్రమంగా అభివర్ణించారు.

ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, ఆడబిడ్డ నిధి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు, నిరుద్యోగ భృతి, మూడు సెంట్ల స్థలం, ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీల పరిస్థితిపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**రూ.1.80 లక్షల కోట్ల బకాయి: కళ్యాణి**

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం మహిళలకు ప్రభుత్వం భారీ మొత్తంలో బకాయి పడిందని వరుదు కళ్యాణి పేర్కొన్నారు. 25 నెలల కాలానికి మహిళలకు చెల్లించాల్సిన మొత్తం సుమారు రూ.1.80 లక్షల కోట్లుగా ఆమె ఆరోపించారు. ఇంత మొత్తాన్ని చెల్లించకుండా రూ.3 వేల కోట్లు ఇచ్చామని చెబుతున్నారని, ఆ మొత్తం ఏ ఖాతాల్లో జమ చేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**'ఓటుకు నోటు'పై ప్రశ్న**

మహిళలు డబ్బులు తీసుకుని ఓట్లు వేశారని, వారికి ప్రశ్నించే నైతిక హక్కు లేదన్న చంద్రబాబు వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. 'ఓటుకు నోటు' వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ చంద్రబాబుపై తీవ్ర ఆరోపణలు చేశారు. మహిళలను లంచగొండులుగా చిత్రీకరించడం సరికాదన్నారు.

**ఉచిత బస్సుపైనా విమర్శలు**

ఎన్నికల మేనిఫెస్టోలో ఎలాంటి షరతులు లేకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని బస్సులకే పరిమితం చేశారని కళ్యాణి ఆరోపించారు. సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. ఉచిత బస్సు పేరుతో ఆర్టీసీని క్రమంగా ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.



**సున్నా వడ్డీ, 'సూపర్ సిక్స్' హామీలపై నిలదీత**

గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ కోసం నిధులు కేటాయించామని పేర్కొన్న కళ్యాణి, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సున్నా వడ్డీ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పెన్షన్, మూడు సెంట్ల స్థలం వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

**మహిళల భద్రతపై ఆందోళన**

మహిళల భద్రత కోసం గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'దిశ' చట్టాన్ని రద్దు చేశారని ఆరోపించిన ఆమె, రాష్ట్రంలో మద్యం, గంజాయి, డ్రగ్స్ సమస్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**తిరుమల శ్రీవారి సాక్షిగా ప్రమాణం చేయగలరా?**

ఎన్నికల్లో తాను ఒక్క రూపాయి కూడా పంచలేదని తిరుమల శ్రీవారి సాక్షిగా చంద్రబాబు ప్రమాణం చేయగలరా అని వరుదు కళ్యాణి సవాల్ చేశారు. మహిళలు అమాయకులు కాదని, పదేపదే మోసపోవడానికి సిద్ధంగా లేరని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర మహిళలు ఏకమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తారని హెచ్చరించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పునర్వ్యవస్థీకరించిన 10 జోన్లలో సోమవారం పీజీఆర్ఎస్

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 16:** ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల 17న పునర్వ్యవస్థీకరించిన 10 జోన్లలో నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.

సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు భీమిలి, మధురవాడ, ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, పెందుర్తి, గాజువాక, అగనంపూడి, అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. నగరంలోని పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, నీటి సరఫరా, వీధి దీపాలు, హార్టికల్చర్, రెవెన్యూ, యూసీడీ, ఇంజినీరింగ్ తదితర జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కమిషనర్ సూచించారు.

ప్రత్యేకంగా మారిన జోన్ కార్యాలయాలు

వెస్ట్ జోన్: 52వ వార్డులోని ఎన్ఏడీ కొత్త రోడ్డు, గౌరీనగర్‌లో ఉన్న పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నారు.

నార్త్ జోన్: 51వ వార్డులోని మాధవధార ఉడా లేఅవుట్, ఆర్టీఏ ఆఫీస్ రోడ్డు, పంప్‌హౌస్ వెనుక ఉన్న ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుంది.

అగనంపూడి జోన్: 85వ వార్డులోని పెదమడక, శివాలయం రోడ్డులో వినాయక టెంపుల్ సమీపంలోని రాజీవ్‌గాంధీ కళ్యాణ మండపంలో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నారు.



ఈ మూడు జోన్ కార్యాలయాల వేదికలు మారినందున ఆయా ప్రాంతాల ప్రజలు కొత్త ప్రదేశాలను గమనించాలని జీవీఎంసీ కమిషనర్ కోరారు. మిగిలిన అన్ని జోన్ల కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం యథాస్థానంలోనే జరుగుతుందని తెలిపారు.

# ఈ నెల 17న విశాఖకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

## లేబర్ కోడ్స్‌తో కార్మిక హక్కులకు నష్టం




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 16:** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల హక్కులకు తీవ్ర నష్టం జరుగుతుందని సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి కరిమలియన్ అన్నారు. కార్మిక సంఘాలన్నీ ఈ కోడ్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు.

విశాఖ మద్దిలపాలెంలోని ఏచూరి భవన్‌లో ప్రభుత్వ రంగ సంస్థల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన లేబర్ కోడ్స్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కొత్త చట్టాల అమలుతో కార్మికులు ప్రస్తుతం అనుభవిస్తున్న అనేక హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సంఘం ఏర్పాటు చేసుకునే హక్కును కఠినతరం చేయడంతో పాటు, యాజమాన్యాలతో బేరసారాలు జరిపే హక్కుపైనా పరిమితులు విధించారని విమర్శించారు.

గతంలో అత్యవసర సేవలకు మాత్రమే సమ్మెకు 14 రోజుల ముందస్తు నోటీసు నిబంధన ఉండేదని, ప్రస్తుతం అన్ని సంస్థల్లోనూ సమ్మెకు ముందస్తు నోటీసు తప్పనిసరి చేశారని పేర్కొన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్‌లో కన్సిలియేషన్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత సమ్మె చేయకూడదనే నిబంధనలు తీసుకొచ్చారని, వీటివల్ల కార్మిక సంఘాలపై, నాయకులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు.

కంపెనీలు, పరిశ్రమలు, సంస్థలను మూసివేయడానికి గతంలో ఉన్నట్లుగా ప్రభుత్వ ముందస్తు అనుమతులు అవసరం లేని విధంగా నిబంధనలు మార్చారని కరిమలియన్ తెలిపారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికులందరికీ ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం చేస్తున్న వాదన వాస్తవానికి భిన్నంగా ఉందన్నారు.

కార్మిక చట్టాల్లో మార్పులు యాజమాన్యాలు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారి కార్మికులపై దోపిడీకి అవకాశం కల్పించే ప్రమాదం ఉందని ఆయన ఆరోపించారు. మారిన పరిస్థితుల్లో కార్మికులను యాజమాన్యాల ఆధీనంలో ఉంచే విధంగా లేబర్ కోడ్స్ రూపొందించబడ్డాయని విమర్శించారు. కార్మిక హక్కులను పరిరక్షించేందుకు లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ వర్క్‌షాప్‌కు విశాఖ స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు యు. రామస్వామి అధ్యక్షత వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. నర్సింగరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.ఎం. శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి. కుమార్‌తో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్, పోర్ట్ అథారిటీ, బీహెచ్‌ఈఎల్, రక్షణ రంగం, హిందుస్థాన్ షిప్‌యార్డ్, ఎన్‌టీపీసీ, రైల్వే తదితర రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 16:** స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ కర్షక నాయకుడు, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను పురస్కరించుకుని విశాఖ నగర పోలీసు కమిషనరేట్‌లో ఆయనకు ఘన నివాళులర్పించారు. నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్., లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రైతాంగ హక్కుల పరిరక్షణ, కార్మిక సంక్షేమం కోసం సర్దార్ గౌతు లచ్చన్న సాగించిన పోరాటాలు అసాధారణమైనవని కొనియాడారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి నిలవడంతో పాటు, స్వతంత్ర భారతదేశంలోనూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు.

ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో రైతాంగ సమస్యలపై లచ్చన్న చేపట్టిన చారిత్రాత్మక ఉద్యమాలు, శ్రామిక వర్గాల పక్షాన ఆయన చేసిన రాజీలేని పోరాటాలు నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షానే నిలబడిన ఆయన రాజకీయ నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు.

## మల్టీపర్పస్ కమ్యూనిటి భవనం కై వినతి



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 16**
మహా విశాఖ నగర పాలక సంస్థ 75వ వార్డు అయ్యన్న పాలెం గ్రామం శ్రీ క్రిష్ణ యువజన సంఘం సభ్యులు ఏపీ స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజుని మర్యాదపూర్వకంగా కలిసి, అయ్యన్న పాలెం గ్రామం అభివృద్ధిలో భాగంగా నూతన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ కావాలని వినతిపత్రం అందజేశారు . గాజువాక నియోజకవర్గ ఎం ఎల్ యా ఏ , రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కి ఈ విషయాన్ని తెలియజేసి, త్వరలో నూతన భవనం నిర్మాణం గ్రామస్తులు, గ్రామ పెద్దలు కోరుతున్నారని తెలిపి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు చర్యలు తీసుకోవాలని కోరుతామని మొల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మొల్లి రవిరాజు, మొల్లి అప్పారావు, రమణ, అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

---

✷ 18న నూతన కార్యకవర్గ సమావేశం.. కీలక తీర్మానాలపై చర్చ



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 16:** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ నెల 17వ తేదీ సాయంత్రం విశాఖపట్నం రానున్నట్లు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. 18వ తేదీన నిర్వహించనున్న నూతన కార్యకవర్గ సమావేశానికి నితిన్ నబీన్ అధ్యక్షత వహించనున్నారని వెల్లడించారు.

ఈ సమావేశానికి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిపై, నీటిపారుదల ప్రాజెక్టులపై రెండు ప్రధాన తీర్మానాలను సమావేశంలో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. జాతీయ అధ్యక్షుడితో పాటు బీఎల్ సంతోష్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

డబుల్ ఇంజన్ ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ గ్రోత్‌ను సాధిస్తున్నామని మాధవ్ అన్నారు. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో విశాఖకు 25 శాతానికి పైగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వరంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. మరో వారంలో గోదావరి నీరు ఉత్తరాంధ్ర నేలను తాకబోతున్నాయని చెప్పారు.

విశాఖలో గూగుల్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, గ్రీన్ హైడ్రోజన్, బల్క్ డ్రగ్ పార్క్ వంటి ప్రాజెక్టులు కూడా రానున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతున్న తరుణంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విశాఖకు రావడం సంతోషకరమని మాధవ్ అన్నారు.

విశాఖ విమానాశ్రయం మూసివేత ప్రాంతవాసిగా తనకు కొంత బాధ కలిగిస్తోందని, అయితే విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించుకున్నామని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

---

## ప్రహరీ లేని పెదవలస ఆశ్రమ పాఠశాల.. ప్రమాదంలో గిరిజన విద్యార్థుల భద్రత!"

### మౌలిక వసతులు కల్పించాలి.. తల్లిదండ్రులు, గ్రామ పెద్దల డిమాండ్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 16:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని పెదవలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు అనేక మౌలిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతకు అత్యంత కీలకమైన ప్రహరీ గోడ లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వారు పేర్కొన్నారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సమావేశం అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. హాస్టల్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో అడవి ప్రాంతం నుంచి విషసర్పాలు, ఇతర జంతువులు లోపలికి వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా అపరిచిత వ్యక్తులు కూడా హాస్టల్ పరిసరాల్లోకి సులభంగా ప్రవేశించే అవకాశం ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడం, ఇరుకైన గదుల్లోనే విద్యార్థులు చదువుకోవడంతో పాటు నిద్రించాల్సి రావడం వంటి సమస్యలు ఉన్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయని, తాగునీటి విషయంలోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దోమల బెడద కూడా తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.సమావేశాల్లో అధికారులు హామీలు ఇవ్వడం కాకుండా క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల భద్రత దృష్ట్యా హాస్టల్ చుట్టూ ప్రహరీ గోడను అత్యవసరంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు మరుగుదొడ్లు, స్నానపు గదులను ఆధునీకరించడం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, విద్యార్థులకు సరిపడా వసతి కల్పించడం వంటి మౌలిక సదుపాయాలను వెంటనే మెరుగుపరచాలని కోరారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు విద్యతో పాటు సురక్షితమైన వాతావరణం కూడా ఎంతో అవసరమని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెద్దవలస ఆశ్రమ పాఠశాలలోని సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

## నాతవరం రెల్లి కాలనీలో నాసా సంస్థ ఆధ్వర్యంలో చేతిబోరు ప్రారంభోత్సవం...



✷ 25 ఏళ్లుగా వెనకబడిన ప్రాంతాల్లో మంచినీటి సమస్య పరిష్కారాన్ని కృషి....
✷ వెల్స్ ఫర్ లైఫ్ డైరెక్టర్ (అమెరికా) మైక్ వైజర్...

**నాతవరం, పెన్ పవర్ (ఆగస్టు 16):** నాతవరం మండలం నాతవరం గ్రామంలోని రెల్లి కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు నాసా సంస్థ ముందుకు వచ్చింది. విద్యుత్ సరఫరా లేని సమయాల్లో, ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజల అవస్థలను గుర్తించిన నాసా సంస్థ,కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేతిబోరు ఏర్పాటు చేయించింది.ఆదివారం నాసా సంస్థ ప్రతినిధులు రాజా కులపతి,మైక్ వైజర్ చేతిబోరును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా వెల్స్ ఫర్ లైఫ్ డైరెక్టర్ మైక్ వైజర్ మాట్లాడుతూ నాతవరం గ్రామంలో రెల్లి కాలనీలో బోరు ఏర్పాటు చేసి, సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని,గత 25 సంవత్సరాలుగా భారతదేశంలోని వివిధ గ్రామాల్లో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను గుర్తించి నాసా సంస్థ ద్వారా బోర్ వెల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 200 బోర్వెల్స్ ఏర్పాటు చేసినట్లు మైక్ వైజర్ వెల్లడించారు.ప్రజల ఆరోగ్యానికి స్వచ్ఛమైన తాగునీరు పోషకమైన ఆహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.భూగర్భం నుంచి లభించే నీటిని సురక్షితంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. మంచినీటి సమస్యతో బాధపడుతున్న వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.చేతిబోరు అందుబాటులోకి రావడంతో రెల్లికాలనీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కొంతవరకు తీరనున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, మాజీ ఎంపీపీ లు పారుపల్లి కొండబాబు, నేతల విజయ్ కుమార్,మండల టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు బంగారు సూరిబాబు,సామర్ల రామారావు,నాసా సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శ్రీను,వెంకట రత్నం,స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# రింతాడలో ఉచిత కంటి వైద్య శిబిరం




**72 మందికి కంటి పరీక్షలు.. 45 మందికి కళ్లద్దాలు, 25 మందికి ఆపరేషన్లు**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ ఆగస్టు 16 :**అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలంలోని రింతాడ సచివాలయం ఆవరణలో ఆదివాసీ మాతోట రైతుల మ్యాక్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మ్యాక్స్ సీఈఓ ధనుంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి జీకేవీధి, చింతపల్లి మండలాల నుంచి ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొత్తం 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 45 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి అందించగా, 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో ఒక్కరిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మ్యాక్స్ సీఈఓ ధనుంజయ్ తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.శిబిరంలో ఆప్తాల్మాలజిస్టులు ముక్క రమేష్, నాగలక్ష్మి, శిరీష, ఈశ్వరి, గాయత్రి, పుణ్యవతి తదితరులు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించారు.

---

## గిరిజన యువతకు కార్పొరేట్ కొలువుల అవకాశం

✷ ఈ నెలాఖరులో పాడేరులో జాబ్‌మేళా.. 35 ఏళ్లలోపు యువతీయువకులకు అవకాశం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 16:**గిరిజన యువతకు ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెలాఖరులో పాడేరు కేంద్రంగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జీకేవీధి ఎస్సై సురేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ జాబ్‌మేళాలో 35 ఏళ్లలోపు గిరిజన యువతీయువకులు పాల్గొని ప్రైవేట్ రంగంలోని వివిధ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని ఎస్సై సూచించారు. ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా తమ పేర్లను స్థానిక పోలీస్‌స్టేషన్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి నైపుణ్యాలకు అనుగుణంగా కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు ఈ జాబ్‌మేళా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్సై సురేష్ పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని ఆయన కోరారు.

## పారిశ్రామిక ప్రాంతం లో ఆటో డ్రైవర్లకు క్రైమ్ అవేర్‌నెస్



**గాజువాక:పెన్ పవర్ ,ఆగస్టు 16**
నేరాల నియంత్రణ, ప్రయాణికుల భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గాజువాక మెయిన్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌స్పెక్టర్ జి.డి. బాబు, ఎస్ఐ హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు నేరాల నివారణ, ప్రయాణికుల భద్రత, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కార్యకలాపాల గుర్తింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణలో ఆటో డ్రైవర్ల సహకారం ఎంతో కీలకమని పోలీసులు తెలిపారు.

ప్రయాణికులు ఆటోలో విలువైన వస్తువులు, ఆభరణాలు, సెల్‌ఫోన్లు తదితర వస్తువులు మర్చిపోతే వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అప్పగించి నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. ఆటోలలో బ్యాటరీలు, స్పేర్ పార్ట్స్ తదితర వస్తువుల చోరీలను అరికట్టేందుకు సురక్షిత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని, తప్పనిసరిగా హ్యాండ్ లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలని .పెట్రోల్ చోరీకి గురికాకుండా పెట్రోల్ ట్యాంక్‌ను లాక్ చేసి ఉంచడంతో పాటు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

విధుల్లో ఉన్న సమయంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 కు లేదా 9490617922 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.నేరాల నివారణలో పోలీసులు మాత్రమే కాదు ప్రజలు, ఆటో డ్రైవర్లు, ప్రతి ఒక్కరి సహకారం ఎంతో కీలకం అని పోలీసులు పేర్కొన్నారు. గాజువాక ప్రాంతంలో నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.నేర రహిత సమాజం కోసం పోలీసులతో కలిసి ముందుకు సాగుదాం అని పిలుపునిచ్చారు.

# అథ్లెటిక్స్‌లో మెరిసిన జీకేవీధి ఏకలవ్య విద్యార్థి

**షాట్ పుట్ లో రజతం సాధించిన గుల్లెలి చంద్రశేఖర్ నాయుడు**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగష్టు16:**అథ్లెటిక్స్ క్రీడల్లో గూడెం కొత్తవీధి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి గుల్లెలి చంద్రశేఖర్ నాయుడు ప్రతిభ చాటాడు. 27వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో రజత పతకం సాధించి సౌత్ ఇండియా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.చిత్తూరు జిల్లా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా తరపున పాల్గొన్న చంద్రశేఖర్ నాయుడు అండర్-16 షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన చంద్రశేఖర్ నాయుడు సెప్టెంబరు 2 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న 37వ సౌత్ ఇండియా జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ రమణారావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ నాయుడును అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.





02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## విమానాశ్రయ ప్రయాణికులకు ఏరో ఎక్స్‌ప్రెస్



**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 16 :**ప్రయాణికుల సౌకర్యార్థం గాజువాక నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ నెల 17వ తేదీ నుంచి ఏరో ఎక్స్‌ప్రెస్ పేరుతో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను ప్రారంభించనున్నట్లు విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. పర్యావరణహిత, సౌకర్యవంతమైన ప్రజా రవాణాను అందించాలనే ఉద్దేశంతో ాూాాజ ఈ సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తోం దన్నారు,ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఏ ఎస్ ఆర్-1, ఏ ఎస్ ఆర్-2 పేర్లతో రెండు మార్గాల్లో బస్సులు నడపనున్నారు. ప్రతి అరగంటకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు సర్వీసులు కొనసాగుతాయని రీజినల్ మేనేజర్ తెలిపారు.

ఏ ఎస్ ఆర్-2-1 మార్గం , గాజువాక--ఎన్ఏడి--గురుద్వార్--జూ పార్క్-- మారికవలస --ఆనందపురం--తగరపువలస--ఎర్రాటుజంక్షన్--విమానాశ్రయం.,ఏ ఎస్ ఆర్-2-2 మార్గం: గాజువాక--సింధియా--రైల్వే స్టేషన్--బస్ స్టేషన్--సిరిపురం --ఇస్కాన్ టెంపుల్--ఐటి హిల్స్-- మారికవలస-- ఆనందపురం--తగరపువలస-- ఎర్రాటు జంక్షన్--విమానాశ్రయం.

ప్రయాణ ఛార్జీలు

ఏ ఎస్ ఆర్-2-1: పాత గాజువాక నుంచి రూ.400, చీూణ రూ.350, గురుద్వార్ రూ.300, జూ పార్క్ రూ.250, మారికవలస రూ.200, ఆనందపురం రూ.150, తగరపువలస రూ.100, ఎర్రాటుజంక్షన్ నుంచి రూ.50.

ఏ ఎస్ ఆర్-2-2: పాత గాజువాక నుంచి రూ.400, సింధియా రూ.400, కంచరపాలెం రూ.400, సిరిపురం రూ.350, ఇస్కాన్ టెంపుల్ రూ.300, ఐ టి హిల్స్ రూ.250, మారికవల స రూ.200, ఆనందపురం రూ.150, తగరపువలస రూ.100, ఎర్రాటుజంక్షన్ నుంచి రూ.50గా ఛార్జీలను నిర్ణయించారు.

విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు తమ ప్రయాణ సమ యానికి అనుగుణంగా ఏరో ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసు లను వినియోగించుకోవాలని రీజినల్ మేనేజర్ అప్పలనాయు డు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన, పర్యా వరణహిత ప్రజా రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా ఈ సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.ం

# గోపాలపట్నంలో కళా వేదిక ఏర్పాటు చేయాలి



**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబుకు కళా సేవాపీఠం వినతి**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 16 :** ఒకప్పుడు విశాలమైన గ్రామంగా ఉన్న గోపాలపట్నం నేడు విశాఖ నగరంలో కీలక ప్రాంతంగా అభివృద్ధి చెంది, సుమారు 50 కాలనీలకు ప్రధాన కూడలిగా మారింది. జనాభా పెరుగుతున్నప్పటికీ కళా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రత్యేకమైన వేదిక లేకపోవడం కళాకారులు, సాంస్కృతిక సంస్థలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో గోపాలపట్నం కళా సేవాపీఠం సభ్యులు విశాఖ పశ్చిమ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబును కలిసి గోపాలపట్నంలో ప్రత్యేక కళా వేదికను ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. స్థానికంగా కళాకారులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ తగిన వేదిక అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ప్రాంగణాలు, ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోందని వారు గణబాబు దృష్టికి తీసుకువచ్చారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో నాటకాలు, సంగీత కార్యక్రమాలు, సాహిత్య సభలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవార్డు కార్యక్రమాలు, కళాకారుల సన్మానాలు తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన కళా భవనం అవసరమని కళా సేవాపీఠం సభ్యులు తెలిపారు. ముఖ్యంగా స్థానిక కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు, యువతను కళలు, సాంస్కృతిక రంగాల వైపు ప్రోత్సహించేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కళా సేవాపీఠం సభ్యుల విజ్ఞప్తిపై ప్రభుత్వ విప్ గణబాబు సానుకూలంగా స్పందించారు. గోపాలపట్నం వంటి అభివృద్ధి చెందిన ప్రాంతంలో కళా, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక అవసరమని ఆయన పేర్కొంటూ, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో కళా వేదిక ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కళా సేవాపీఠం సభ్యులు తెలిపారు. కళాకారుల సమస్యను అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించిన గణబాబుకు కళా సేవాపీఠం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కళా వేదిక ఏర్పాటైతే గోపాలపట్నం ప్రాంతంలో సాంస్కృతిక కార్యకలాపాలకు మరింత ఊతం లభించడంతో పాటు, స్థానిక కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు శాశ్వత వేదిక అందుబాటులోకి వస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కళా సేవాపీఠం సభ్యులు నందవరపు సోములు, చందు సుబ్బారావు, గోరపల్లి బంగార్రాజు, గోరకల రామదాసు, కొంతం నూక రాజేశ్వరరావు, మిద్దె అప్పారావు, ఎం.ఎన్‌వి. శ్రీనివాస్, కె. వెంకట్, అనపర్తి అప్పారావు, వి. జగదీష్ చంద్రశేఖర్, ముదపాక శివ, ఏ. సూర్యచంద్ర, శరగడం మోహన్ కృష్ణ, ఏ. విశ్వేశ్వరరావు, ఎన్.వి. నరసింహం, ఏ.ఆర్. కిషోర్, కడిమి అప్పలనాయుడు, సింహాచలం తదితరులు ఉన్నారు.

# బీపీపై బెహారా ఆసుపత్రి అవగాహన వాక్‌కు విశేష స్పందన

- **300 మందితో గోపాలపట్నం మెయిన్‌రోడ్‌లో అవగాహన ర్యాలీ**
- **బీపీని నిర్లక్ష్యం చేయొద్దు.. క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి**
- **ఆరోగ్యకరమైన జీవనశైలితో అధిక రక్తపోటును నియంత్రించవచ్చు వైద్యుల సూచన**

**పెందుర్తి, పెన్ పవర్, ఆగస్టు 16 :** అధిక రక్తపోటు (బీపీ)పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బెహరా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన వాక్‌కు విశేష స్పందన లభించింది. సుమారు 300 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో బీపీ నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గోపాలపట్నం మెయిన్‌రోడ్ నుంచి నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీలో బెహరా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, బెహరా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీపీని నిర్లక్ష్యం చేయవద్దని, క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని బీపీని నియంత్రించుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అధిక రక్తపోటు ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చని వైద్యులు తెలిపారు. అయితే దీర్ఘకాలంగా బీపీ నియంత్రణలో లేకపోతే గుండె, మెదడు, మూత్రపిండాలు తదితర అవయవాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని సూచించారు. బీపీపై అవగాహన పెంచుకోవడం, అధిక రక్తపోటును ముందుగానే గుర్తించడం, వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వైద్యులు వివరించారు. మందులు అవసరమైతే వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా తీసుకోవడంతో పాటు ఉప్పు వినియోగాన్ని తగ్గించడం,




సమతుల్య ఆహారం తీసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని సూచించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బెహరా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో బెహరా ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా రక్తపోటును ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు పిలుపునిచ్చారు.

## భారీ ఉద్యోగ మేల జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్



**జి.మాడుగుల పెన్ పవర్ ఆగస్ట్(16)** జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పాడేరులో జరుగు భారీ ఉద్యోగమేలకు 35 సంవత్సరాల లోపు గిరిజన యువతి యువకులు ప్రైవేట్ సంస్థలలో పనిచేయుటకు అభ్యర్థులకు సదవకాశం ఈ అవకాశాన్ని అభ్యర్థులు అందిపుచ్చుకుంటారని ఎస్సై సాయిరాం పడాల్ తెలియజేశారు ఆసక్తి గలవారు జి.మాడుగుల పోలీస్ స్టేషన్ నందు తమ యొక్క సర్టిఫికెట్లు జిరాక్స్ లు తీసుకువచ్చి పేర్లు నమోదు చేసుకుంటారని తెలిపారు

## దేశీయ విత్తనాలతో సామాజిక వనాలు పెంచాలి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 16 :**

శీతోష్ణస్థితి వేడెక్కకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలను పెంచాలని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.వి. మురళీమోహన్ పిలుపునిచ్చా రు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు పర్యావర ణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఆదివారం మధు రవాడలోని ఎన్‌వీపీ లా కాలేజీ ఎదురుగా ఉన్న కొండలపై గ్రీన్ క్లైమేట్ టీం, వనమాలి, సీటీజీ, మన కూరగాయల తోట సం స్థల ఆధ్వర్యంలో విత్తనాలు, విత్తన బంతులను చల్లే కార్య క్రమం నిర్వహించారు. తాటి పళ్లు, మామిడి టెంకలు, కొంకు డుకాయ, గంగరావి, నేరేడు, సీతాఫలం తదితర దేశీయ వృక్ష జాతుల విత్తనాలను విద్యార్థులతో కలిసి కొండలపై చల్లారు.

ఈ సందర్భంగా డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాల నేప థ్యంలో ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను తగ్గించేందుకు ముం దస్తు చర్యలు అవసరమన్నారు. సామాజిక వనాల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, తాము తినే దేశీయ పండ్ల విత్తనాలను సేకరించి వాటితో వనాలు పెంచాలని సూచించారు.విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాబోయే తరాలకు పర్యావరణ పరిర క్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించేందుకు తన మనవళ్లకు కూడా విత్తనాలు, విత్తన బంతులతో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం మాట్లాడుతూ ప్రతి దేశీయ విత్తనం మొక్కగా మొలకెత్తేలా చర్యలు తీసుకోవాల న్నారు. ప్రకృతి ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించి, సహజ సిద్ధంగా పండించిన పంటలను వినియోగించాలని సూచిం చారు. తాటి విత్తనాలతో తాటితోపులను పెంచాలని, ప్రతి విద్యార్థి కనీసం 100 విత్తన బంతులను తయారు చేసి కొండలు, మైదాన ప్రాంతాల్లో చల్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సత్వా నేచురల్స్‌కు చెందిన మధుసూ దనరెడ్డి, వనమాలి, సీటీజీ, మన కూరగాయల తోట ప్రతిని ధులు ఉష, కవిత, యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ. కృష్ణకు మారి తదితరులతో పాటు 50 మందికి పైగా పాల్గొన్నారు.

# కాకినాడ కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి

- **బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం లచ్చన్న చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకం**
- **ఎమ్మెల్యే వనమాడి**

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 16:** బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న చేసిన పోరాటాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. లచ్చన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా ఆదివారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి డా.డి. తిప్పేనాయక్,బీసీ సంక్షేమ శాఖ అధికారులు, బీసీ సంక్షేమ సంఘాల నాయకులు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శు భపరిణామమన్నారు. రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పలుమార్లు జైలు శిక్ష అనుభవించిన లచ్చన్న, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు.నాటి రోజుల్లో కనీస రవాణా,మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితుల్లో రైతుల కోసం, స్వాతంత్ర్యం కోసం, రాష్ట్ర ప్రజల హక్కుల కోసం లచ్చన్న పోరాటం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. లచ్చన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా రెవెన్యూ అధికారి డా.డి. తిప్పేనాయక్ మాట్లాడుతూ రైతులు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం లచ్చన్న చూపిన తెగువ ప్రశంసనీయమన్నారు. సామాజికంగా,ఆర్థికంగా



అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన అందించిన సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఏ. శ్యామల కుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు డా.చప్పిడి వెంకటేశ్వరరావు,చొల్లంగి వేణుగోపాలరావు,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో మాజీ సర్పంచి గుణ్ణం రామచంద్రరావు విగ్రహ ఆవిష్కరణ





**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగస్టు 16:** నారాయణపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేదిక నారాయణపురంలో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ ఆప్యాయంగా "అబ్బులూ..." అని పిలిచే దివంగత సర్పంచి గుణ్ణం రామచంద్రరావు నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావడం ఎంతో గర్వంగా ఉందని ఆప్కాబ్ ఛైర్మన్, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. నారాయణపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం పండుగ వాతావరణంలో గుణ్ణం రామచంద్రరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు.

గుణ్ణం రామచంద్రరావు 1980 నుంచి 1995 వరకు మూడు పర్యాయాలు నారాయణపురం సర్పంచిగా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని గన్ని వీరాంజనేయులు కొనియాడారు. నారాయణపురం ఎస్టీ పేటలో గ్రామస్థులు సైతం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారంటే ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు.

రామచంద్రరావు తనయుడు, సూర్య కంపెనీస్, జీఆర్‌సీ ట్రస్టు ఛైర్మన్ గుణ్ణం సురేష్‌బాబు జన్మదిన వేడుకల సందర్భంగా తండ్రి విగ్రహాన్ని అధునాతనంగా పునర్నిర్మించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబుకు గన్ని వీరాంజనేయులు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన షెడ్లు, ఉద్యోగులు వాహనాలు నిలుపుకునేందుకు నిర్మించిన షెడ్డు, అరుంధతి పేటలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఏర్పాటు చేసిన షెడ్లను గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోదరుడు పత్సమట్ల భీమరాజు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరుడు పుప్పాల పుండరీకాక్షుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు యథావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

**ప్రజల నుంచి అర్జీల స్వీకరణ.. ఫీడ్‌బ్యాక్ కోసం క్యూఆర్ కోడ్**






**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 16:** ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో భాగంగా సోమవారం ఆగస్టు 17న యథావిధిగా పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. రంపచోడవరంలోని స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించిన అర్జీలను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను జిల్లా పీజీఆర్ఎస్ కేంద్రంలో నేరుగా సమర్పించడంతో పాటు 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు ప్రభుత్వం పీజీఆర్ఎస్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను సేవలు పొందిన అనంతరం మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళులు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 16:**
తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఆదేశాల మేరకు స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీఎస్పీ(ఎస్.బి) బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలను, త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ(ఏఆర్) టి.వి.ఆర్.కె.రవి కుమార్, ఆర్.ఐ (హోంగార్డ్స్) ఎస్.దుర్గాప్రసాద్, ఆర్.ఐ(అడ్మిన్) జి.త్రినాధ్ రావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం

**150 మందికి వైద్య సేవలు.. రక్త, థైరాయిడ్ పరీక్షలు నిర్వహణ**







**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 16:** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్లు శ్రీనివాసరాయుడు, దాసరి ఉమామహేష్, పావని ప్రియ, వెలమ స్నేహా మాధురి పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. 46 మందికి రక్త పరీక్షలు, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు, ఒకరికి ఈసీజీ, 11 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వ్యాధులపై డాక్టర్లు పావని, స్నేహా మాధురి ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులు, సహాయకులకు రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, రామకృష్ణ మిషన్ సిబ్బంది, వాలంటీర్ గిరిరాజ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్, రచయిత యన్.కె. నాగేశ్వరరావుకు ఘన సన్మానం

✷ 42 ఏళ్ల జర్నలిజం సేవలకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఘనంగా సత్కారం



**పెనుగొండ పెన్ పవర్ ఆగస్టు 16::** జర్నలిజం రంగంలో 42 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ యన్.కె. నాగేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన పశ్చిమగోదావరి జిల్లా మహాసభలో ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. 1984 నుంచి జర్నలిజం రంగంలో కొనసాగుతున్న నాగేశ్వరరావు ఆంధ్రభూమి, డెక్కన్ క్రానికల్, స్వాతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, విజేత, వార్త తదితర పత్రికల్లో పనిచేస్తూ అనేక వార్తా కథనాలు, కథలు, నవలలు రచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజాహితమే లక్ష్యంగా తన రచనలు, వార్తా కథనాల ద్వారా సమాజానికి సేవలందించారు.

# వెంకటరామన్నగూడెంలో 21వ పార్తీనియం (వయ్యారిభామ) అవగాహన కార్యక్రమం






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 16:** డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), వెంకటరామన్నగూడెం ఆధ్వర్యంలో 21వ పార్తీనియం (వయ్యారిభామ) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డా. ఎ. దేవీవరప్రసాద్ రెడ్డి పాల్గొని పార్తీనియం (వయ్యారిభామ) కలుపు మొక్క వల్ల కలిగే దుష్ప్రభావాలు, పర్యావరణం, పంటలు, పశువులు మరియు మానవ ఆరోగ్యంపై దాని ప్రభావం గురించి పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.

పార్తీనియం (వయ్యారిభామ) మొక్క వేగంగా వ్యాప్తి చెందుతూ పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా, మనుషులు మరియు పశువుల్లో అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలు మరియు శ్వాసకోశ ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని డా. దేవీవరప్రసాద్ రెడ్డి వివరించారు. పార్తీనియం విత్తనాలు విస్తృతంగా వ్యాప్తి చెందడం వల్ల భవిష్యత్తులో కలుపు నియంత్రణ మరింత కష్టతరమవుతుందని తెలిపారు.

పార్తీనియం నియంత్రణకు మొక్కలు చిన్న దశలోనే పీకివేయడం, పుష్పించే ముందు తొలగించడం, కలుపు నివారణ చర్యలు చేపట్టడం, పొలాలు మరియు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి సమగ్ర నియంత్రణ పద్ధతులను పాటించాలని సూచించారు. పార్తీనియం నిర్మూలనలో రైతులు, విద్యార్థులు మరియు ప్రజలు సమష్టిగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్తీనియం వల్ల కలిగే హానిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు రావాలని కార్యక్రమంలో సూచించారు....

# వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం

✷ అంత్యోదయ సిద్ధాంతంతో పేదల సంక్షేమానికి కృషి చేసిన మహానేత



**గంగవరం, పెన్ పవర్. ఆగస్టు 16** భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బీహారీ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కుంజం వీరవెంకట సత్యనారాయణమ్మ అన్నారు. ఆదివారం గంగవరం మండలం గంగవరం గ్రామంలో వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ మండల అధ్యక్షురాలు పుట్టపల్లి నీలాలమ్మ అధ్యక్షతన స్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సత్యనారాయణమ్మ మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రవేశపెట్టిన అంత్యోదయ సిద్ధాంతం ద్వారా సమాజంలోని చిట్టచివరి పేదవాడికి కూడా సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేశారని కొనియాడారు.

దేశవ్యాప్తంగా రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా రహదారులు ఏర్పాటు చేసి ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచిన మహానేత వాజ్‌పేయి అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో గంగవరం మండల ప్రధాన కార్యదర్శి జెట్ల అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు దొర, మండల కార్యదర్శి సారపు వెంకన్నదొర, మాజీ మండల అధ్యక్షుడు సారపు పోతురాజుదొర, గార్లపాడు టీడీపీ బూత్ ఇన్‌చార్జి కోసు తమ్మన్నదొర తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న ఉద్యోగుల సంక్షేమం ఇదేనా?

12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటుపై ఉద్యోగ సంఘం ఆవేదన



**గంగవరం, పెన్ పవర్ ఆగస్టు 16:** ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, ప్రభుత్వం--ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఏపీ ఏజెన్సీ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కన్వీనర్ డా. పరిశిక అప్పన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇటీవల జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను వివరించినప్పటికీ, వాటిపై ఇప్పటివరకు స్పష్టత రాలేదని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని కోరారు.

**ఐదేళ్లకోసారి పీఆర్సీ ఎక్కడ?**

పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఉద్యోగుల వేతనాలను సవరించేందుకు ప్రతి ఐదేళ్లకోసారి పే రివిజన్ కమిటీ (పీఆర్సీ) ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం జాప్యం చేస్తోందని అప్పన్నబాబు విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే రెండు పీఆర్సీలు, అంటే పదేళ్ల కాలాన్ని ఉద్యోగులు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జూలై నాటికి 11వ పీఆర్సీ కాలం ముగిసినప్పటికీ, ఇప్పటివరకు 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు.

**ఎన్నికల హామీలు అమలు చేయాలి**

ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి, గతంలో ప్రకటించిన 43 శాతం ఫిట్‌మెంట్‌కు తగ్గకుండా కొత్త పీఆర్సీ అమలు చేస్తామని, పెండింగ్‌లో ఉన్న డీఏలతో పాటు మధ్యంతర భృతి (ఐఆర్) అందిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డా. అప్పన్నబాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీలపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్నారు.

**ఉద్యోగుల జీతాలపై ప్రభుత్వ లెక్కలపై అభ్యంతరం**

ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 98 శాతం ఉద్యోగుల జీతాలకే ఖర్చవుతోందన్న వాదన ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాగ్ లెక్కల ప్రకారం ఉద్యోగుల జీతాల కోసం ఖర్చవుతున్న మొత్తం సుమారు 37.4 శాతం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం వాస్తవ గణాంకాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

**పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి**

ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించి చెల్లించాలని, పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను విడుదల చేయాలని డా. అప్పన్నబాబు ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా తక్షణమే 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ నివేదిక వచ్చేలోపు ఉద్యోగులకు కనీసం 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, చర్చల ద్వారా పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రంపయర్రంపాలెం తొలి మహిళ సర్పంచ్ దంగేటి సత్యానందం మృతి.



**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 16:-** సుదీర్ఘ రాజకీయ వారసత్వం కలిగి కోరుకొండ సమితి ఉపాధ్యక్షులుగా జిల్లా వ్యాప్తంగా పేరుగాంచిన దెంగేటి వెంకటరత్నం (చినకాపు) పెద్ద కోడలు దంగేటి వెంకటేశ్వరరావు భార్య రంపఎర్రంపాలెం గ్రామ తొలి మహిళా సర్పంచ్ దంగేటి సత్యానందం ఆదివారం ఉదయం మృతి చెందారు.వృద్ధాప్యంతో అస్వస్థకు గురైన ఆమెను తన కుమారులు బాబ్జి కుమార్ లు రాజమహేంద్రవరంలోనే ఆసుపత్రిలో చికిత్స పొదుతూ తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు దంగేటి సత్యానందం భర్త దెంగేటి వెంకటేశ్వరరావు ముక్కుసూటి తనంతో నిజాయితీగా జీవితమంతా ఒక్కమాట అనిపించుకోకుండా గ్రామంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారని అటువంటి సత్యా వెంకటేశ్వరరావు భార్య సత్యానందం అత్తవారి కుటుంబ గౌరవానికి మరింత గౌరవాన్ని పెంచే విధంగా తన సర్పంచ్ కాలంలో పనిచేశారని పలువురు ఆమె పలువురు తమ సంతాపంలో తెలిపారు. సత్యానందం గారు 1996 నుండి 2001లో సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించారు. సత్యానందం మామ దేంగేటి వెంకటరత్నం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండ సమితి ఉపాధ్యక్షులుగాను కేంద్ర మాజీ మంత్రివర్యులు కపిలేశ్వరం జమిందార్ ఎస్వీబీకే సత్యనారాయణ రావు (చంటిబాబు) మంచి స్నేహితులు కాగా, ఏజెన్సీ టైగర్ ముత్యాల ముత్యాల రాయుడు స్వయానా వీరికి బంధువు, ఇలా రాజకీయంగా మీరు ప్రస్తావనాన్ని కుటుంబ పరంగా చూసుకుంటే ఎంతో కీర్తి ప్రతిష్టలు కలిగిన దంగేటి వారి కుటుంబాన్ని ఏకైక సర్పంచ్ గా సేవలందించిన మృతురాలు సత్యానందం గారి పుట్టింటి కుటుంబం కడియం మండలంలోనూ కీర్తి ప్రతిష్టలు కలిగిన కుటుంబం గా పలువురు కొనియాడారు.

# భారతరత్న మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



వర్ధంతి సందర్భంగా బీజేపీ నేతల ఘన నివాళులు

**గంగవరం /రంపచోడవరం, ఆగస్టు 16:** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న, బీజేపీ అగ్రనేత అటల్ బీహారీ వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని రంపచోడవరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. పోలవరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఈకా బుల్లికొండలుదొర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను, ఆయన ఆదర్శాలను స్మరించుకున్నారు. దేశ సమగ్రత, అభివృద్ధి, సుపరిపాలన కోసం వాజ్‌పేయి తన జీవితాన్ని అంకితం చేశారని నాయకులు పేర్కొన్నారు. వాజ్‌పేయి చూపిన మార్గంలో ప్రతి బీజేపీ కార్యకర్త నడుస్తూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంపచోడవరం మండల అధ్యక్షుడు చోడీ జంగందొర, జిల్లా ఉపాధ్యక్షుడు కుండ్ల కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి గానిరాజ్, బీజేపీ నాయకులు ముర్ల బాలురెడ్డి, ముత్యాలుదొర, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి ఆపన్నహస్తం

రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందజేసిన స్నేహితులు, బంధువులు






**గంగవరం /కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 16:** అనారోగ్యంతో బాధపడుతున్న తమ మిత్రుడికి అడ్డతీగల ఏపీఆర్ఎస్ పాఠశాల 1991, 1995 బ్యాచ్‌లకు చెందిన స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఆపన్నహస్తం అందించారు. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కోటం శివకుమార్ దొర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన మిత్రులు, సన్నిహితులు కలిసి రూ. 1,20,300 ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు.

కొండపల్లి గ్రామానికి చెందిన బంధువులు, స్నేహితులు, కొండపల్లి సంక్షేమ సంఘం సభ్యులు కలిసి రూ. 36,000, ఏపీఆర్ఎస్ అడ్డతీగల 1995 బ్యాచ్ మిత్రులు రూ. 50,000, 1991 బ్యాచ్ మిత్రులు రూ. 6,000 అందించారు. అదేవిధంగా ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు రూ. 20,000, మైలబోయిన సత్తిబాబు, శిరీష కుటుంబ సభ్యులు రూ. 5,000, వారి స్నేహితుల ద్వారా మరో రూ. 3,000 సేకరించారు. మొత్తంగా రూ. 1,20,300 ఆర్థిక సహాయం సమకూరింది.

సేకరించిన మొత్తాన్ని ఆదివారం ఏపీఆర్ఎస్ అడ్డతీగల 1995 బ్యాచ్ సభ్యులతో కలిసి ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, చోడి ఆదినారాయణ, చోడి శ్రీనివాసరావు, నాగులపల్లి సుబ్బారావు, కోసు రామకృష్ణ, మైలబోయిన సత్తిబాబు, అన్నిక అప్పారావు తదితరులు కాకినాడలోని శివకుమార్ దొర నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. శివకుమార్ దొరకు వచ్చే మంగళవారం శస్త్రచికిత్స జరగనున్న నేపథ్యంలో అది విజయవంతంగా పూర్తై ఆయన త్వరగా కోలుకోవాలని మిత్రులు, బంధువులు ఆకాంక్షించారు. అనారోగ్య సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ శివకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# డాక్టర్ రామలక్ష్మి కి ఉత్తమ సేవా పురస్కారం.



**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 16:-** గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ హాస్పిటల్)సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ రామలక్ష్మి రోగులకు అందిస్తున్న సేవల దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉత్తమ పురస్కారాన్ని అంద జేసింది. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా వివిధశాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పని చేస్తున్న డాక్టర్ ఎల్ రామలక్ష్మి ని వైద్య ,ఆరోగ్య విభాగంలో ఉత్తమ సేవ పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఐ ఎ ఎస్, ల సమక్షంలో డాక్టర్ ఎల్ రామలక్ష్మికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. డాక్టర్ రామలక్ష్మి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు ప్రశంస పత్రాలు కూడా చేజిక్కించుకున్న రామలక్ష్మిని పలువురు అభినందించారు.

# విప్లవత్మాక అభివృద్ధి కి శ్రీకారం చుట్టిన మహనీయుడు వాజపాయ్-వాజపాయ్ కు బిజెపి నేతల ఘన నివాళి.



**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 16.,** దేశంలో విప్లవాత్మక అభివృద్ధికి శ్రీకారం చుట్టిన మహనీయులు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని బిజెపి నేతలు నివాళులర్పించారు. వాజపాయ్ వర్ధంతి సందర్భంగా తాడేపల్లిగూడెం బిజెపి పట్టణ కార్యాలయం ఆదివారం సాయంత్రం జరిగిన దానికి నివాళి కార్యక్రమానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షత వహించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని నివాళు లర్పించారు. స్వర్ణ చతుర్భుజి పేరిట దేశంలోని జాతీయ రహదారులు అనుసంధాన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ పథకంతో విశేష అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. పార్లమెంట్ లో ప్రతిపక్షాల సైతం వాజపాయ్ ప్రసంగం కోసం ఎదురుచూసేవారన్నారు. తన సహజ కవితా శైలిలో చేసే ప్రసంగం అధ్యంతం సభ్యులను ఆకట్టుకొనేవరన్నారు. బిజెపి నర్సాపురం పార్లమెంటరీ మీడియా ఇన్ ఛార్జ్ నడిచే సోమేశ్వర రావు మాట్లాడుతూ ప్రధానిగా అటల్ బిహారీ వాజ్పేయి ఫోక్రాన్ అణు పరీక్షలు నిర్వహించి అను పాటవ దేశంగా ప్రపంచ దేశాల సరసన నిలిపిన ఘనత ఆయనదేనని అర్పించారు. ఆయన బాటలో ప్రధాన నరేంద్ర మోడీ వాజపేయి ఆశయాలను నెరవేరుస్తూ దేశాన్ని శాస్త్ర సాంకేతిక పారిశ్రామిక ఆర్థిక రంగాల్లో విశేష అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. పట్టణ బిజెపి అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ వాజపాయ్ పరిపాలన దేశభివృద్ధికి బాటలు వేశారన్నారు. పరిపాలన దక్షత, క్రమశిక్షణ కు నిదర్శనమన్నారు. ఓబిసి మోర్చా జిల్లా నాయకులు ఇమ్మంది బెనర్జీ మాట్లాడుతూ కాశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు కోసం ఉద్యమించిన శ్యామప్రసాద్ ముఖర్జీ ప్రాణత్యాగశీ చేయడంతో వాజపాయ్ పాత్రికేయునిగా విరమించి రాజకీయ రంగప్రవేశం చేసి దేశాన్ని ప్రగతిఫదంలో నడిపించారాని కొనియాడారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వర రావు,రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు,బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, కావ్యరెడ్డి,కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ,ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహామూర్తి,జిల్లా కార్యవర్గ సభ్యులు పాటే నాగేశ్వర రావు,మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి తాడాల సూర్యకుమారి, పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మీదుర్గ, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొని వాజపాయ్ కి నివాళులు అర్పించారు.

# వడ్డిగూడెం రేవుపాట బహిరంగ వేలం



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.16** మండలంలోని వడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గోదావరి నది రేవుల నిర్వహణకు సంబంధించి 2026--27 సంవత్సరానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శిపి.ప్రసాద్,ప్రకటించారు. వేలం 17-08-2026 ఉదయం 03:00 గంటలకు వడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. పడవ రేవు వేలంలో పాల్గొనే అ భ్యర్థులు ముందుగా నిర్ణయించిన అర్హతలు,నిబంధనలు, డిపాజిట్ తదితర షరతులను పాటించాల్సి ఉంటుందని, అధికారులు తెలిపారు. రేవుల నిర్వహణ కాలం 01-04-2026 నుంచి 31-03-2027 వరకు ఉం టుందని పేర్కొన్నారు. అలాగే వేలంలో పాల్గొనే వారు సంబంధిత అధి కారులు సూచించిన విధంగా రుసుములు/డిపాజిట్ చె ల్లించాల్సి ఉంటుందని,ఎంపికైనరేవునిర్వహణదారులు గ్రామపంచాయతీ నిబంధనలనుతప్పనిసరిగా పాటిం చాలని నోటీసులో స్పష్టం చేశారు. వేలం ప్రక్రియలో పాల్గొ నదలచిన ఆసక్తి గల వ్యక్తులు పూర్తి నిబంధనలను పరి శీలించి,నిర్ణీత సమయానికిహాజరుకావాలని,గ్రామపంచాయతీఅధికారులుసూచించారు.

# బహుజనుల ఐక్యత తోనే రాజ్యాధికారం సాధ్యం




- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి
- బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో బహుజనుల సదస్సు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 16** :బహుజనులు ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించడం సాధ్యమవుతుందని, ఇప్పుడే బహుజనుల అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని రిటైర్డ్ డిజిపి, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ జే. పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక ఆనం కళాకేంద్రంలో బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సర్దార్ గౌతు లచ్చన్న 117 వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్ణచంద్రరావు హాజరయ్యారు. తొలుత బహుజన నాయకుల చిత్రపటాలకు పూలమా లవేసి నివాళులు అర్పించారు. అనంతరం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్ల అమల్లో పాలకులు వివక్షత పాటిస్తున్నారని విమర్శించారు. 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 24 శాతం రిజర్వేషన్లు అమలు చేయడమే నిదర్శన మన్నారు. నిట్ పరీక్షల అవకతవకల సంఘటనల ఆధారంగా రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల అవకత వకల రాష్ట్ర విద్యా మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని ఆందోళన చేయడం ద్వంద విధాన మని విమర్శించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వంపై జగన్ పార్టీ ఎందుకు ఆందోళన చేయడం లేదని ప్రశ్నించారు.బహుజనులకు రాజ్యాధికారం లేకపోవడం వల్లే కమ్మ, రెడ్డి వర్గాలు బహుజనులను అణగ ద్రొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1952 నుంచి 2024 వరకు జరిగిన 16 ఎన్నికల్లో 2902 మంది ఎంఎల్ఏలు అసెంబ్లీలో అడుగుపెడితే వాళ్ళలో కమ్మ, రెడ్డి ఎంఎల్ఏలే 1207 ( 549 ం 658 ) మందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలు అధికంగా ఉన్న కమ్మ ,రెడ్ల సీట్లు కొట్టేస్తున్నరన్నారు. . బీసీలకు దక్కాల్సిన స్థానాలలో కమ్మ, రెడ్లు ఎమ్మెల్యేలు అవుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో మతతత్వవాదం కాదని, కులవాదం నడుస్తుంద న్నారు. రెండే కమ్మ రెడ్లు సిఎం కులాలుగా రాజ్యమేలుతుంటే 200 కులాలు అసెంబ్లీ గడప తొక్కలేక పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండే రెండు ఎన్టీర్ కుటుంబం, వైస్సార్ కుటుంబం, ఈ నాలుగు పార్టీలను తమ చెప్పు చేతుల్లో ఉంచుకున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలని గుప్పిట్లో పెట్టుకొని బహు జనులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ రెండు కులాలు ఎస్సిలను విడదీస్తున్నాయని, బిసిలను కలవనీయకుండా గ్రూపులు చేస్తున్నారని అన్నారు. ఇకపై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు బహుజనులు రాజ్యా ధికారం సాధించే దిశగా ఆలోచించాలని పిలుపు ఇచ్చారు. బీసీ సంఘం నాయకులు మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీ కులాలకు 40 సం ల ప్రాతినిధ్య వహించిన ఉద్యమ సారధి సర్దార్ గౌతు లచ్చన్న అని తెలిపారు. బీసీ ఎస్ఎస్సి మైనార్టీలు కలిసికట్టుగా పోరాటం చేస్తే రాజ్యాధికారం సాధ్యమేనని ధీమా వ్యక్తం చేశారు.

**స్వార్థపరులు వల్ల నష్టపోతున్న బీసీలు...**

ఈ సభలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్ కుమార్ మాట్లాడుతూ , బీసీ హక్కుల సాధన పేరుతో తెలంగాణ రాష్టానికి చెందిన 50 సంవత్సరాల సీనియర్ ఒక బీసీ నాయకుడు ఆంధ్రప్రదేశ్ బీసీలను తన రాజకీయ స్వార్ధ కోసం బలి పశువులను చేశారని విమర్శించారు. బీసీ సాధికారత , హక్కులు సాధన పేరుతో రాష్ట్రంలోని బీసీలను ఉద్యమాల పేరుతో ఢిల్లీ వరకు తీసుకెళ్లి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో కుమ్మక్కయి పదవులు పొందుతూ ఆర్థికంగా నష్టం కలిగిస్తూ బీసీలను మోసం చేశారని విమర్శించారు. బీసీలకు ఫీజు రీయింబ ర్స్మెంట్ వంటి ఏ సంక్షేమ పథకం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆ పథకం తన వల్లనే వచ్చిందని ప్రచార యావ ఉందన్నారు. అధికారంలో ఉంటే ఆ పార్టీ గొడుగు పట్టి రాజ్యసభ సీటు సంపాదించుకున్న స్వార్థపూరిత బీసీ నాయకులను బీసీ నాయకుడిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఉంటూ ఆంధ్రప్రదేశ్లో పదవి సంపాదించుకున్నాడని అటువంటి వ్యక్తిని దూరం పెట్టాలన్నారు. మాజీ డిజిపి పూర్ణచంద్ర రావు ఆధ్వర్యంలో బీసీలు ఐక్యతతో రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**16 తీర్మానాలను ఆమోదం:**

ఈ సభలో వివిధ అంశాలపై చర్చించిన అనంతరం 16 తీర్మానాలను ఆమోదించారు.

ఏపీ అసెంబ్లీలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల వాటా కల్పించాలి. భోజనం మహిళలకు జనాభా నిష్పత్తికి రాజకీయ ప్రాతినిధ్యం,సామాజిక ఆర్థిక సాధికారత కల్పించాలి. ప్రాంతాలకు అన్యాయం జరగకూడదు. నీట్ ను రద్దు చేసి రాష్ట్రాలకు విద్య హక్కులను పునరుద్ధించాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలి. ప్రైవేటు కార్పొరేట్ రంగాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలి. చిన్న సన్న కారు రైతుల భూములకు యాజమాన్య హక్కులు, ప్రాజెక్టుల్లో భాగస్వామి కల్పించాలి. ఆదివాసీలకు పిసా,1/ 70 చట్టాలను పూర్తిగా అమలు చేయాలి. యువతకు విద్యా ,ఉపాధి హక్కులు, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యం కల్పించాలి. సామాజిక న్యాయ బడ్జెట్కు రాజ్యాంగబద్ధ హామీ కల్పించాలి. మతం మారిన దళితులకు రాజ్యాంగ సమాన హక్కులు కల్పించాలి. ముస్లిం సమాజానికి సమాన హక్కులు, జనాభా నిష్పత్తి మేర రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలు, కార్మికులు రైతులతో (బహుజన ఐక్యత) ఉమ్మడి రాజకీయ వేదిక నిర్మించాలి. గీత కార్మికుల సంక్షేమం, భద్రత ఆర్థిక సాధికారతకు చర్యలు చేపట్టాలి. బహుజన మీడియా సాహిత్యం కళా సాంస్కృతిక ఉద్యమాలను మోలోపేతం చేయాలి. తొలుత సర్దార్ గౌతు లచ్చన్న సేవలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోకేకే సంజీవరావు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర, తెలంగాణ చైర్పర్సన్ డాక్టర్ ఖాండవల్లి లక్ష్మి బూడిద శరత్ కుమార్, పితాని కుటుంబరావు, మట్టపర్తి సూర్యచంద్రరావు, లక్ష్మణ రావు, బాబురావు సూర్య కుమారి ,సాన బోయిన మల్లేష్ రావు, ముని శేఖర్ యాదవ్, కట్ట శేఖర్ రావు, యాకోబు తదితరులు తీర్మానాలను ప్రవేశపెట్టారు

## రక్షభారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ మరియు ఫాబ్ హాస్పిటల్ మెగా వైద్య శిబిరం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 16.**చాగల్లు మండలం కలవలపల్లి గ్రామంలో ఆర్సేసేఓ మరియు ఫెర్టిలిటీ ఎండ్ బోన్ వారు ఉమ్మడిగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం లో 200 పైగా కలవలపల్లి మరియు పరిసర గ్రామ ప్రజలు ఉచిత వైద్య సేవలు వినియోగించుకున్నారు. ప్రత్యేక ఆకర్షణ గా ఎముకల దృఢత్వం నిర్ణయించే సుమూరు 2000/- విలువ గల బిఎండి పరీక్ష , యూరిక్ ఆసిడ్ పరీక్ష మరియు అవసరమైన మందులు ఈ శిబిరంలో ఉచితంగా అందించారు.

ఈ వైద్య శిబిరంకు తమ అమూల్యమైన సమయాన్ని కేటాయించిన డా. వెంకట్ పసుమర్తి (ఎంఎస్ ఆర్తో) ని కలవలపల్లి గ్రామ పెద్దలు చెరుకూరి దుర్గారావు,పాలకుర్తి నాగేశ్వరరావు, రక్ష భారత సామాజిక సేవ సంస్థ అల్లాడి బాలాజీ ,అల్లాడి సాయిరామ్, పాలకుర్తి కుమార్ సత్కరించగా డా. వెంకట్ మాట్లాడుతూ " తనకు ఈ సేవాతత్వం ఎంతో మంది ప్రజలకు ఉచిత మరియు కనీస ఖర్చులతో వైద్యమందించిన తన తండ్రి డ్రా పిఎల్వీవ్ ప్రసాద్ నుండి వచ్చిందని ప్రసంగించారు.

ప్రెసిడెంట్ అల్లాడి బాలాజీ మాట్లాడుతూ అందని ద్రాక్షలా మారిన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్న ఈ అనుభవజ్ఞులైన వైద్యులు డ్ర..వెంకట్ కి గ్రామస్తుల తరపు నుండి కృతజ్ఞతలు తెలియచేశారు.

## ఫ్లెక్స్ ఫ్రీ సిటీ అమలులో అధికారులు విఫలం

- అనుమతిలేని ఫ్లెక్సీల తొలగింపులో నిర్లక్ష్యం తగదు
- పౌర సంక్షేమ సంఘం

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 16:** ఫ్లెక్స్ ఫ్రీ సిటీగా కాకినాడను తీర్చిదిద్దుతామని అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని పౌర సంక్షేమ సంఘం విమర్శించింది. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో అనుమతిలేని ఫ్లెక్స్ బోర్డులు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయని సంఘం పేర్కొంది. వివేకానంద పార్కు నుంచి రామారావుపేట రోడ్డు,నూకాలమ్మ గుడి మీదుగా టూటౌన్ వరకు,అలాగే తిలక్ వీధి జంక్షన్, పెద్ద మార్కెట్, రామకృష్ణారావుపేట, టీటీడీ సెంటర్, వైఎస్సార్ కూడలి, జగన్నాధపురం, వెంకటేశ్వర ఆలయం, చర్చి స్క్వేర్, ఎన్టీఆర్ బ్రిడ్జి డౌన్, అన్నమ్మఘాటీ, బాలయోగి సెంటర్, విద్యుత్‌నగర్ ప్రాంతాల్లో అనుమతిలేని ఫ్లెక్సులు కొనసాగుతున్నాయని సంఘం ప్రతినిధులు తెలిపారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా, రహదారి మలుపుల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సుల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఫ్లెక్స్ ఫ్రీ సిటీ అమలుకు ప్రత్యేకంగా కార్పొరేషన్ పబ్లిక్ వాట్సాప్ నంబర్‌ను ప్రకటించాలని, ప్రజలు అనుమతిలేని ఫ్లెక్సుల సమాచారాన్ని అధికారులకు నేరుగా తెలియజేసే అవకాశం కల్పించాలని కోరారు.నిరంతర నిఘా, అనుమతిలేని ఫ్లెక్సుల తొలగింపు, జరిమానాలు, అవసరమైన చోట కేసుల నమోదు వంటి చర్యలు చేపట్టినప్పుడే ఫ్లెక్స్ ఫ్రీ సిటీ లక్ష్యం సాధ్యమవుతుందని సంఘం పేర్కొంది. రానున్న వినాయక చవితి, విజయదశమి, దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వంటి పండుగల సందర్భంగా అనుమతిలేని ఫ్లెక్సులు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.కలెక్టర్ ఆదేశాలను కఠినంగా అమలు చేసి, ఫ్లెక్స్ ఫ్రీ సిటీ నిర్వహణలో అధికారులు చిత్తశుద్ధి చూపాలని, రాష్ట్రంలో కాకినాడను నిజమైన 'ఫ్లెక్స్ ఫ్రీ సిటీ'కి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలపాలని పౌర సంక్షేమ సంఘం కోరింది.ు

## శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి- మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 16:** రామచంద్రపురంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు,బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.

ఆదివారం ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భూమిపూజ చేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు.పనులు విజయవంతంగా పూర్తై భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయాలు భారతీయ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకలని,ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక ప్రాంతాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు.ఆలయ ప్రాంగణ విస్తరణ, భక్తుల సౌకర్యాల మెరుగుదల,మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.ఆలయ అభివృద్ధికి ప్రజలు,దాతలు తమ వంతు సహకారం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ గణేష్ శర్మ,ట్రస్ట్ సభ్యులు, అర్చకులు,కూటమి నాయకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ముద్రగడ మృతి వారి కుటుంబానికి తీరని లోటు.





- వారి కుటుంబానికి వైసిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.
- మాజీ మంత్రి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,మిథున్ రెడ్డి.

**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 16:**మాజీ మంత్రి, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతి వారి కుటుంబ సభ్యులకే కాకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.కిర్లంపూడిలో ముద్రగడ కుటుంబాన్ని మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ఆదివారం పరామర్శించారు.ముద్రగడ సతీమణి పద్మావతి,ఆయన కుమారులు ముద్రగడ వీర రాఘవరావు( బాలు ),ప్రతిపాడు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు.అనంతరం ముద్రగడ చిత్రపటానికి వైసీపీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ముద్రగడతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముద్రగడ కుటుంబానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తోట నరసింహం,పేర్ని నాని,కురసాల కన్నబాబు,జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా,మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా,ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి,జ్యోతుల చంటిబాబు,మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్,పెద్దాపురం,రామచంద్రపురం నియోజకవర్గాల వైసీపీ ఇంచార్జిలు దవులూరి దొరబాబు,పిల్లి సూర్యప్రకాష్,రాష్ట్ర మాజీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు,నరిసే శివాజీ,ప్రముఖ పారిశ్రామికవేత్త గణేశుల రాంబాబు,వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీ కృష్ణంరాజు,రాష్ట్ర విద్యార్థి విభాగం జోన్ 2 ప్రెసిడెంట్ తోట రాంజీ,రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్,రాష్ట్ర కార్యదర్శి తోట రామకృష్ణ,రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేశ్,జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు రామకుర్తి చంద్రమూర్తి,తుని నియోజకవర్గ పరిశీలికులు వాసిరెడ్డి జమీల్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా, జిల్లా వైసిపి మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత శ్రీనివాస్, ప్రత్తిపాడు జడ్పిటిసి బెహరా రాజరాజేశ్వరి

దొరబాబు,ప్రత్తిపాడు,ఏలేశ్వరం,శంఖవరం వైసీపీ మండల అధ్యక్షులు రామిశెట్టి నాని,గొల్లపల్లి సురేష్,నరాల శ్రీను,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కాశీ విశ్వనాథ్,పెంటకోట నాగబాబు,వేగి రామకృష్ణ,దోమాల గంగాధర్,బండారు రాజా,దాడి పెద్దబుజ్జి,మళ్ల నాగబాబు,చిలకమర్తి వెంకటరమణ,శరకణం సంతోష్,గొంతిరెడ్డి సతీష్,తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ రామలక్ష్మి కి ఉత్తమ సేవా పురస్కారం.



**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 16:-** గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ హాస్పిటల్)సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ రామలక్ష్మి రోగులకు అందిస్తున్న సేవల దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉత్తమ పురస్కారాన్ని అంద జేసింది. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా వివిధశాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పని చేస్తున్న డాక్టర్ ఎల్ రామలక్ష్మి ని వైద్య ,ఆరోగ్య విభాగంలో ఉత్తమ సేవ పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఐ ఎ ఎస్, ల సమక్షంలో డాక్టర్ ఎల్ రామలక్ష్మికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. డాక్టర్ రామలక్ష్మి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు ప్రశంస పత్రాలు కూడా చేజిక్కించుకున్న రామలక్ష్మిని పలువురు అభినందించారు.

## విప్లవత్మాక అభివృద్ధి కి శ్రీకారం చుట్టిన మహనీయుడు వాజపాయ్-వాజపాయ్ కు బిజెపి నేతల ఘన నివాళి.

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 16.,** దేశంలో విప్లవాత్మక అభివృద్ధికి శ్రీకారం చుట్టిన మహనీయులు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని బిజెపి నేతలు నివాళు లర్పించారు. వాజపాయ్ వర్ధంతి సందర్భంగా తాడేపల్లిగూడెం బిజెపి పట్టణ కార్యాలయం ఆదివారం సాయంత్రం జరిగిన దానికి నివాళి కార్యక్రమానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షత వహించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని నివాళులర్పించారు. స్వర్ణ చతుర్భుజి పేరిట దేశంలోని జాతీయ రహదారులు అనుసంధాన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ పథకంతో విశేష అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. పార్లమెంట్ లో ప్రతిపక్షాల సైతం వాజపాయ్ ప్రసంగం కోసం ఎదురుచూసేవారన్నారు. తన సహజ కవితా శైలిలో చేసే ప్రసంగం అద్యంతం సభ్యులను ఆకట్టుకొనేవరన్నారు.బిజెపి నర్సాపురం పార్లమెంటరీ మీడియా ఇన్ ఛార్జ్ నడిచే సోమేశ్వర రావు మాట్లాడుతూ ప్రధానిగా అటల్ బిహారీ వాజ్పేయి ఫోక్రాన్ అణు పరీక్షలు నిర్వహించి అను పాటవ దేశంగా ప్రపంచ దేశాల సరసన నిలిపిన ఘనత ఆయనదేనని అర్పించారు. ఆయన బాటలో ప్రధాన నరేంద్ర మోడీ వాజపేయి ఆశయాలను నెరవేరుస్తూ దేశాన్ని శాస్త్ర సాంకేతిక పారిశ్రామిక ఆర్థిక రంగాల్లో విశేష అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. పట్టణ బిజెపి అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ వాజపాయ్ పరిపాలన దేశభివృద్ధికి బాటలు వేశారన్నారు. పరిపాలన దక్షత, క్రమశిక్షణ కు నిదర్శనమన్నారు. ఓబిసి మోర్చా జిల్లా నాయకులు ఇమ్మంది బెనర్జీ మాట్లాడుతూ కాశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు కోసం ఉద్యమించిన శ్యామప్రసాద్ ముఖర్జీ ప్రాణత్యాగశీ చేయడంతో వాజపాయ్ పాత్రికేయునిగా విరమించి రాజకీయ రంగప్రవేశం చేసి దేశాన్ని ప్రగతిఫదంలో నడిపించారాని కొనియాడారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వర రావు,రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు,బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, కావ్యరెడ్డి,కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ,ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహామూర్తి,జిల్లా కార్యవర్గ సభ్యులు పాటే నాగేశ్వర రావు,మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి తాడాల సూర్యకుమారి, పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మీదుర్గ, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొని వాజపాయ్ కి నివాళులు అర్పించారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com